# సాక్షి అనంతపురం

ఆదివారం । 4 । ఆగస్టు । 2024






**చీనీ టన్ను రూ.17,700**

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.17,700 పలికాయి.



**స్నేహం..శాశ్వతం**

స్నేహం.. ఒక అనిర్వచనీయమైన బంధం. ఎల్లలులేని మమకారానికి ప్రతీక. ప్రతి నెలా ఆగస్టు మొదటి ఆదివారం స్నేహితుల దినోత్సవం జరుపుకుంటున్నారు. 8లో

గరిష్టం/కనిష్టం
34.8°/24.2°

జిల్లా అంతటా శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

## న్యూస్‌రీల్

### ‘ఈ-క్రాప్’ నమోదు ప్రారంభం



బీకేఎస్ మండలం రేకులకుంటలో పంట వివరాలు నమోదు చేస్తున్న దృశ్యం

**అనంతపురం అగ్రికల్చర్:** జిల్లా వ్యాప్తంగా శనివారం ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ ప్రారంభించినట్లు జేడీఏ కార్యాలయ వర్గాలు తెలిపాయి. తొలిరోజు ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తలేదన్నారు. బుక్కరాయ సముద్రం మండలం రేకులకుంటలో ఈ-క్రాప్ నమోదు కార్యక్రమాన్ని జేడీఏ ఉమామహేశ్వరమ్మ, ఏడీఏ ఎం.రవి, ఏఓ శ్యాంసుందరరెడ్డి తదితరులు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ప్రక్రియను గడువులోపు పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

### సరుకులు సక్రమంగా ఇవ్వాలి



సరుకుల పంపిణీని పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

**అనంతపురం అర్బన్:** కార్డుదారులకు బియ్యం, నిత్యావసర సరుకులు సక్రమంగా అందించాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. శనివారం స్థానిక పాతూరు పరిధిలోని 9వ వార్డులో బియ్యం, సరుకుల పంపిణీ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. సరుకులు సక్రమంగా ఇస్తున్నారా అంటూ కార్డుదారులను ఆరా తీశారు. షెడ్యూల్ ప్రకారం సరుకులు పంపిణీ చేయాలని డీలర్లను, వాహన నిర్వాహకులను ఆదేశించారు. సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ వసంత బాబు, డిప్యూటీ తహసీల్దారు పునీత్, సీఎస్ డీటీ శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

**లక్ష్యాలను పూర్తి చేయాలి**

**అనంతపురం క్రైం:** కేటాయించిన లక్ష్యాలను డీఆర్‌డీఏ, వెలుగు అధికారులు పూర్తి చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. స్థానిక డీఆర్‌డీఏ కార్యాలయాన్ని శనివారం సాయంత్రం ఆయన తనిఖీ చేశారు. అధికారులతో సమీక్ష నిర్వహించారు. పీడీ ఓబులమ్మ, ఏపీడీ ఈశ్వరయ్య, ఏంపీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### టీబీ డ్యాంకు కొనసాగుతున్న వరద

**బొమ్మనహాళ్:** టీబీ డ్యాంలో వరద నీటి చేరిక కొనసాగుతోంది. శనివారం సాయంత్రం 1,38,394 క్యూసెక్కుల నీరు జలాశయంలో చేరాయి. దీంతో 33 గేట్లను ఎత్తి 1,34,888 క్యూసెక్కుల నీటిని నదికి విడుదల చేశారు. అవుట్ ఫ్లో 1,49,256 క్యూసెక్కులుగా నమోదైంది. జలాశయం పూర్తి సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 98.220 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 1,633 అడుగుల నీటి మట్టానికి గాను 1,631.09 అడుగులకు నీరు చేరింది. మరోవైపు, హెచ్చెల్సీ ఆంధ్రా సరిహద్దు 105వ కిలోమీటర్ వద్ద 1,129 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

### బిందు, తుంపర పరికరాల పంపిణీకి గ్రీన్‌సిగ్నల్



డ్రిప్ ద్వారా అరటి సాగు (ఫైల్)

**అనంతపురం అగ్రికల్చర్:** బిందు, తుంపర (డ్రిప్, స్ప్రింక్లర్లు) పరికరాల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. సూక్ష్మసాగు పథకం అమలుకు రంగంలోకి దిగాలని ఏపీఎంఐపీకి ఆదేశాలు జారీ చేశారు. జిల్లాకు అత్యధికంగా 37,500 హెక్టార్లు టార్గెట్ ఇవ్వగా... శ్రీ సత్యసాయి జిల్లాకు 30 వేల హెక్టార్ల లక్ష్యం విధించారు. రైతు సేవా కేంద్రాల్లో (ఆర్ఎస్‌కే) వీఏఏ, వీహెచ్ఏ, వీఏఎస్ఏలను సంప్రదించి కోరుకున్న రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని ఏపీఎంఐపీ పీడీ బి.రఘునాథరెడ్డి, ఏపీడీ జి.ఫిరోజ్‌ఖాన్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉద్యానశాఖ అధికారులు (హెచ్‌వోలు), మైక్రో ఇరిగేషన్ ఏరియా ఆఫీసర్లు (ఎంఐఏఓలు) రైతులకు అవగాహన కల్పించి రిజిస్ట్రేషన్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆధార్‌కార్డు, బ్యాంకు పాసు పుస్తకం, భూమి పాసు పుస్తకం, 1-బీ జెరాక్స్ తదితర వివరాలు సమర్పించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

# అకృత్యం.. నిత్యకృత్యం!

- రెండు మాసాల్లో ఇద్దరు బాలికలపై అత్యాచారం
- మరో ఇద్దరు బాలికల దారుణ హత్య
- బాలికలను బడికి పంపాలంటేనే భయపడుతున్న తల్లిదండ్రులు
- వ్యక్తులపై దాడులు, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసాలకు లెక్కే లేని వైనం
- బాధితులు ఫిర్యాదులు చేసినా పట్టించుకోని పోలీసులు
- దిగజారుతున్న శాంతిభద్రతలపై సామాన్యుల ఆందోళన




**సాక్షి ప్రతినిధి, అనంతపురం:** ఉమ్మడి అనంతపురం జిల్లాలో అకృత్యాలు, అరాచకాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. శాంతి భద్రతలు గాల్లో దీపంలా మారాయి. పోలీసులు తమను ఏమీ చేయలేరన్న ధీమాతో దుండగులు రెచ్చిపోతున్నారు. ప్రభుత్వ ఆస్తుల ధ్వంసాలు, శిలాఫలకాల విధ్వంసాలు, దాడులు, బాలికలపై అత్యాచారాలు ఎక్కడో ఒక చోట చోటుచేసుకుంటూనే ఉన్నాయి. రాజకీయ ప్రత్యర్థులను వెంటాడి హింసిస్తున్న ఘటనలకు లెక్కే లేకుండా పోతోంది. గతంలో ఎన్నడూ లేని రీతిలో జరుగుతున్న దారుణాలు సామాన్యులను తీవ్ర భయాందోళనకు గురి చేస్తున్నాయి.

**బడికి పంపించాలంటే భయం**

కూటమి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కారణంగా బాలికలు, అభం శుభం తెలియని చిన్నారులపైనా దారుణాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ ఏడాది జూన్ 26న పుట్లూరు మండలానికి చెందిన ఓ బాలికను ఐచర్ వాహనంలో తీసుకెళ్లి కామాంధులు అత్యాచారం చేశారు. ఒక దశలో ఫిర్యాదు ఇవ్వడానికి కూడా ఆ కుటుంబం భయపడింది. చివరకు జూలై 2న ఫిర్యాదు ఇచ్చిన తర్వాత గానీ కేసు నమోదు చేయలేదు. జూన్ 6న నార్పల మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి ఐదేళ్ల తన కుమార్తెను దారుణంగా చంపి బావిలో పడేశారు. జిల్లావాసులను నివ్వెరపరిచిన ఈ ఘటనలు మరువకముందే ఈ నెల 2న హిందూపురం మండలం తూమకుంటలో ఏడేళ్ల చిన్నారిని వరుసకు పెదనాన్న చంపి పెన్నానదిలో పాతిపెట్టారు. ఇదే రోజు అనంతపురంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో నాల్గో తరగతి బాలికపై స్కూలు కరస్పాండెంట్ అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ దారుణ ఘటనలు జిల్లాలో క్షీణించిన శాంతిభద్రతలకు అద్దం పడుతున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక కర్నూలు జిల్లా ముచ్చుమర్రిలో చోటుచేసుకున్న బాలిక హత్యాచార ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దారుణానికి ఒడిగట్టిన దుండగుల పట్ల కఠిన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం ఉదాసీనత వైఖరి ప్రదర్శిస్తుండడంతోనే అన్ని చోట్లా అసాంఘిక శక్తులు రెచ్చిపోతున్నాయని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు. ఈ క్రమంలో బాలికలను బడికి పంపించాలంటేనే తల్లిదండ్రులు భయపడుతున్నారు.

**దాడులు, విధ్వంసాలకు లెక్కే లేదు**

ఎన్నికల ఫలితాలు వచ్చిన రోజు నుంచి అంటే జూన్ 4వ తేదీనుంచి ఉమ్మడి అనంతపురం జిల్లాలో దాడులకు లెక్కే లేదు. రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకుని టీడీపీ నాయకులు హింసకు దిగుతున్నారు. హిందూపురం, శింగనమల నియోజకవర్గాల్లో ఒకరు చొప్పున హత్యకు గురయ్యారు. టీడీపీ నేతల ఒత్తిడి తట్టుకోలేక ఉరవకొండ నియోజకవర్గంలో ఒక మహిళ ఆత్మహత్య చేసుకున్నారు. అనంతపురం రూరల్ మండలంలో వెలుగు యానిమేటర్ బలవన్మరణం పొందారు. గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాల ధ్వంసం గురించి ఎంతచెప్పుకున్నా తక్కువే.

**పోలీసుల ప్రేక్షకపాత్ర..**

కళ్లముందే దాడులు జరుగుతున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. తగిన చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారు. పలు చోట్ల బాధితులు ఫిర్యాదులు చేస్తున్నా కేసులు నమోదు చేయడం లేదు. దీంతో ఇదే అదునుగా అసాంఘిక శక్తులు మరింతగా రెచ్చిపోతున్నాయి. రాప్తాడు నియోజకవర్గం రామగిరి మండలంలో పరిస్థితి మరింత దారుణంగా ఉన్నట్లు స్థానికులు వాపోతున్నారు. కూడేరు, గార్లదిన్నె మండలాల్లో ఏటీఎంలను పగులగొట్టి డబ్బు దోచుకెళ్లిన ఘటనలూ కలకలం రేపుతున్నాయి. గ్రామాల్లో చోరీల ఘటనలు పెరిగిపోతున్నాయి.

### కీచక కరస్పాండెంట్‌కు రిమాండ్

**అనంతపురం:** నగరంలో సంచలనం సృష్టించిన బాలికపై అత్యాచారం కేసులో నిందితుడిని రిమాండ్‌కు పంపుతూ జడ్జి ఆదేశాలు జారీ చేశారు. నగరంలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్ కరస్పాండెంట్ ఆంజనేయులు గౌడ్ అదే పాఠశాలలో నాల్గో తరగతి చదువుతున్న చిన్నారిపై అత్యాచారానికి పాల్పడిన విషయం విదితమే. బాధిత చిన్నారి పిన్ని, బాబాయ్ ఫిర్యాదు మేరకు శుక్రవారం ఉదయమే టూటౌన్ పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. అర్ధరాత్రి జడ్జి ప్రతిభ ముందు నిందితుడిని హాజరు పరిచారు. ఈ క్రమంలో ఆంజనేయులు గౌడ్‌ను 14 రోజుల రిమాండ్‌కు పంపుతూ జడ్జి ఆదేశాలు జారీ చేశారు.

### రావణకాష్టంలా రాప్తాడు



రామగిరి మండలం కొత్తగాదిగకుంటలో దళిత రైతులకు చెందిన భూమిని దున్నేసిన దృశ్యం (ఫైల్)

రాప్తాడు నియోజకవర్గంలో పరిస్థితులు మరీ అధ్వానంగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక టీడీపీ మూకలు రెచ్చిపోతున్నాయి. ఇప్పటికే పలు చోట్ల విధ్వంసం సృష్టించాయి. సామాన్య ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకూ జరిగిన దారుణాల్లో మచ్చుకు కొన్ని..

- పాపిరెడ్డి పల్లి గ్రామంలో వైఎస్సార్ సీపీ నేత జయచంద్ర రెడ్డి స్కార్పియో వాహనం ధ్వంసం
- నసనకోటలో వైఎస్సార్ సీపీ ఎన్నికల ఏజెంట్‌గా కూర్చున్న పాపానికి మాల జగదీష్‌ను కిడ్నాప్ చేసేందుకు టీడీపీ నేతల యత్నం
- ముత్యాలంపల్లిలో ఈడిగ శివ కొట్టం కాల్చివేత. ఈ ఘటనలో ఈడిగ శివ తండ్రికి గాయాలు
- రెడ్డివారి పల్లిలో రూ. 50 వేల చోరీ. ఘటనపై పోలీసులు కేసు కూడా నమోదు చేయలేదు
- కొత్త గాదిగకుంట గ్రామంలో దళితులైన పెద్దక్క శివయ్యల వ్యవసాయ భూమిలో నాటిన 550 చీనీ చెట్లు, అనప మొక్కల దున్నివేత. ఈ ఘటనపైనా కేసు నమోదుకు పోలీసుల నిరాకరణ.
- తిమ్మాపురం గ్రామంలో వైఎస్సార్ సీపీకి చెందిన ఓ రైతు పొలంలో బోరు మోటారు, పైపుల ధ్వంసం
- రామగిరి పంచాయతీలో పేదలకు ఇళ్ల కోసం వేసిన జగనన్న లేఅవుట్ ధ్వంసం. జర్నలిస్టుల కోసం ఇచ్చిన ప్లాట్లలో జేసీబీలతో హద్దు రాళ్లు పెకలింపు

# కార్డుదారులకు ‘చేదు’వార్త

- చక్కెర పంపిణీ నిలిపివేత
- గత నెల నుంచి పంపిణీ బంద్
- జూలై, ఆగస్టు కోటా విడుదల చేయని ప్రభుత్వం

**అనంతపురం అర్బన్:** రేషన్ సరుకుల్లో కూటమి ప్రభుత్వం కోత పెడుతోంది. పేదల సంక్షేమం దృష్ట్యా ప్రభుత్వాలు చౌక ధరల దుకాణాల ద్వారా ప్రజలకు తక్కువ ధరకు నిత్యావసర సరుకులు అందిస్తున్నాయి. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం కార్డుదారులకు బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు కింద చక్కెరను తక్కువ ధరకు అందిస్తోంది. అంత్యోదయ అన్న యోజన (ఏఏవై) కార్డుకు ఒక కిలో చక్కెర, బియ్యం కార్డుకు అర కిలో చక్కెర ఇచ్చేవారు. ఏఏవై కార్డుకు చక్కెర కిలో రూ.13.50తో, బియ్యం కార్డుకు అర కిలో రూ.17తో పంపిణీ చేసేవారు.

**కూటమి ప్రభుత్వం వచ్చాక కట్..**

గత ప్రభుత్వం అధికారంలో ఉన్న వరకు ప్రతి నెలా చక్కెర కోటా పేదలకు అందింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే కార్డుదారులకు నిత్యావసర సరుకుల పంపిణీలో భాగంగా ఇస్తున్న చక్కెరకు కోత పెట్టింది. జూలై, ఆగస్టు నెలలకు సంబంధించి జిల్లాకు చక్కెర కోటా విడుదల చేయలేదు. దీంతో పేదలకు చక్కెర అందడం లేదు.

**నెలసరి కోటా 360 టన్నులు**

జిల్లాలో మొత్తం తెల్లకార్డులు 6,67,268 ఉండగా ఇందులో ఏఏవై కార్డులు 53,050, బియ్యం కార్డులు 6,14,218 ఉన్నాయి. చక్కెర ఏఏవై కార్డులకు సంబంధించి కిలో చొప్పున 53 టన్నులు, బియ్యం కార్డులకు అర కిలో చొప్పున 307 టన్నులు కలిపి మొత్తం నెలసరి కోటా 360 టన్నులు అవసరం. గత నెల, ఈనెలకు సంబంధించి 720 టన్నుల చక్కెర ఇవ్వాల్సి ఉండగా ప్రభుత్వం విడుదల చేయలేదు.



**కోటా రాలేదు**

జిల్లాకు సంబంధించి చక్కెర కోటా రాలేదు. దీంతో ప్రజలకు పంపిణీ చేయలేదు. చక్కెర సేకరణకు ప్రభుత్వం టెండర్లు నిర్వహిస్తున్నట్లు సమాచారం ఉంది. సెప్టెంబర్‌లోపు ఈ ప్రక్రియ పూర్తి కానుంది. ఆ తర్వాతే చక్కెర కోటాను ప్రభుత్వం విడుదల చేస్తుంది.

– రమేష్‌రెడ్డి, జిల్లా మేనేజర్, పౌర సరఫరాల సంస్థ

### ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే చర్యలు



పల్లవి హోటల్‌లో ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న ఆహార భద్రతా అధికారి తస్లీమ్

**గుంతకల్లుటౌన్:** ప్లాస్టిక్ కవర్లను వినియోగించి ప్రజారోగ్యానికి హాని కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆహార భద్రతా అధికారి పి.తస్లీమ్ హెచ్చరించారు. పట్టణంలో పలు హోటళ్లు, తోపుడు బండ్లపై ప్లాస్టిక్ కవర్లు వాడుతున్నారని పర్యావరణ ప్రేమికులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ హోటళ్లను తనిఖీ చేయాలని ఆదేశించడంతో శనివారం సాయంత్రం ఎఫ్ఎస్ఓ తస్లీమ్, సిబ్బంది పట్టణంలో పలు హోటళ్లను తనిఖీ చేశారు. నిబంధనలు పాటించని పల్లవి, పవిత్ర హోటళ్లతో పాటు ఓ మొబైల్ టిఫిన్ సెంటర్ నిర్వాహకుడికి నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇడ్లీ ప్లేట్లపై పలుచటి ప్లాస్టిక్ కవర్లు వాడటం వల్ల వేడికి ప్లాస్టిక్ కరిగి ఆరోగ్యానికి హాని కలుగుతుందన్నారు. ఇలాంటి తప్పులు చేస్తే చర్యలు తప్పవన్నారు. ప్రతి ఒక్కరూ ఫుడ్ సేఫ్టీ లైసెన్సు పొందాలని ఆమె సూచించారు.

# తహసీల్దార్లకు పోస్టింగ్

- 40 మందికి స్థానాల కేటాయింపు
- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్

**అనంతపురం అర్బన్:** సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లిన తహసీల్దార్లు జిల్లాకు తిరిగి వచ్చారు. ఈ క్రమంలో అందరికీ పోస్టింగ్ ఇస్తూ కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టరేట్ పరిపాలనాధికారిగా మారుతిని నియమించారు. అలాగే, ఎ.హరికుమార్- అనంతపురం అర్బన్, సి.మునివేలు-బొమ్మనహాళ్, కె.విజయలక్ష్మి - అనంతపురం ఆర్డీఓ కార్యాలయంలో పరిపాలనాధికారి, బి.వాణిశ్రీ- అనంతపురం రూరల్, కె.మోహన్ కుమార్-కూడేరు, బి.ఈరమ్మ-గార్లదిన్నె,బి.లక్ష్మి నాయక్-ఆత్మకూరు, జి.పుణ్యవతి-బుక్కరాయ సముద్రం, ఎస్.బ్రహ్మయ్య-శింగనమల, ఆర్.బాలాజీరాజు-పెద్దపప్పూరు, ఎస్.నయాజ్ అహమ్మద్-వజ్రకరూరు, ఎస్.ఈశ్వరమ్మ-తాడిపత్రి, ఎస్.రజావలి- కలెక్టరేట్‌లో కో ఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్, జి.శ్రీధరమూర్తి-పామిడి, ఎస్.రమాదేవి-గుంతకల్లు, కె.ప్రతాపరెడ్డి-యాడికి, పి.ఉషారాణి- గుంతకల్లు ఆర్డీఓ కార్యాలయ పరిపాలనాధికారి, వై.భూషణం-పెద్దవడుగూరు, ఎస్.మహబూబ్‌బాషా- ఉరవకొండ, ఎస్.బి.భాస్కర్- కళ్యాణదుర్గం, ఆర్.వి.సునీతబాయి- విడపనకల్లు, ఎం.బాలకిషన్-కంబదూరు, సి.షర్మిల- బెళుగుప్ప, ఎస్.పి.శ్రీనివాసులు-కుందుర్పి, ఎస్.శ్రీనివాసులు-గుమ్మఘట్ట, హెచ్.ఓబులేసు- గుత్తి, బి.ఈశ్వరయ్య శెట్టి- శెట్టూరు, ఇ.ఫణికుమార్- కణేకల్లు, బి.అనిల్‌కుమార్-డి.హీరేహాళ్, కె.అరుణకుమారి (తహసీల్దార్ ట్రైనింగ్)- నార్పల, పి.స్నేహారెడ్డి-పుట్లూరు, ఇ.నాగరాజు- యల్లనూరు, పి.విజయకుమారి- రాప్తాడు, డి.వసంతలత- కలెక్టరేట్ మెజిస్ట్రీరియల్ సెక్షన్ సూపరింటెండెంట్, జి.అలెగ్జాండర్- రాయదుర్గం, ఆర్.సుమతి-బ్రహ్మసముద్రం, జి.రిజాజుద్దీన్- కలెక్టరేట్‌లో భూముల విభాగం సూపరింటెండెంట్, డి.నీలకంఠరెడ్డి- కలెక్టరేట్ కేఆర్ఆర్సీ సెక్షన్ సూపరింటెండెంట్, టి.నారాయణస్వామి- భూసంస్కరణల విభాగం స్పెషల్ తహసీల్దార్‌గా నియమితులయ్యారు. పోస్టింగ్ పొందిన వారు తక్షణం విధుల్లో చేరాలని కలెక్టర్ ఆదేశించారు.



# అట్టహాసం..

- ‘అనంత’లో జాతీయస్థాయి బాలికల ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం
- ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ వినోద్‌కుమార్
- ఆంధ్రా, జార్ఖండ్ జట్ల శుభారంభం

**అనంతపురం:** ఆల్ ఇండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలు శనివారం నగరంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన క్రీడాకారిణులతో ఆర్డీటీ స్టేడియం సందడిగా మారింది. కలెక్టర్ వినోద్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభి, మాట్లాడారు. బాలికలు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని పిలుపునిచ్చారు. జాతీయస్థాయి బాలికల విభాగం ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు జిల్లాలో జరగడం గర్వకారణమన్నారు. ఫుట్‌బాల్ ఫెడరేషన్, ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ప్రమాణాలతో ఏర్పాట్లు చేయడం అభినందనీయమన్నారు. పోటీలను చూసి, స్ఫూర్తిని పొందేందుకు వీలుగా జిల్లాలోని అన్ని పాఠశాలలకు చెందిన బాలికలను పంపుతామని ప్రకటించారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కలెక్టర్ వినోద్‌కుమార్



జార్ఖండ్, బిహార్ జట్ల మధ్య మ్యాచ్

**జార్ఖండ్, ఆంధ్రప్రదేశ్ జట్ల విజయం**

పోటీల్లో జార్ఖండ్, ఆంధ్రప్రదేశ్ జట్లు శుభారంభం చేశాయి. జార్ఖండ్- బిహార్ మధ్య జరిగిన మ్యాచులో జార్ఖండ్ జట్టు 3-1 గోల్స్ తేడాతో విజయం సాధించింది. ఆంధ్రప్రదేశ్-హిమాచల్ ప్రదేశ్ మధ్య జరిగిన మ్యాచులో ఆంధ్రప్రదేశ్ జట్టు ఘన విజయం సాధించింది. ఏకపక్షంగా సాగిన ఈ మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ మొత్తం 20 గోల్స్ చేయగా, హిమాచల్ ప్రదేశ్ ఒక గోల్ కూడా చేయలేకపోయింది. ఆంధ్రప్రదేశ్ తరఫున టి. అరుణ 9 గోల్స్ చేసి స్కోరర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచింది. అలాగే కెప్టెన్ ఎం.అనూష 6 గోల్స్, ఈ.సాయి వశిష్ఠ 3 గోల్స్, వి.నందిని, ఎం.షామీత చెరొక గోల్ చేశారు.





మ్యాచ్ తిలకిస్తున్న ఈశాన్య రాష్ట్రాలకు చెందిన క్రీడాకారిణులు, 9 గోల్స్ చేసిన ఏపీ క్రీడాకారిణి అరుణ

### పీఏబీఆర్‌లో పెరుగుతున్న నీటి మట్టం



పీఏబీఆర్‌లో చేరుతున్న తుంగభద్ర జలాలు

**కూడేరు:** మండల పరిధిలోని పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్)లో నీటి మట్టం పెరుగుతోంది. తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీ ద్వారా రోజుకు 550 క్యూసెక్కుల నీరు పీఏబీఆర్‌కు చేరుతున్నట్లు డ్యాం ఇరిగేషన్ డీఈ శశిరేఖ తెలిపారు. శనివారం డ్యాం నీటి మట్టాన్ని పరిశీలించారు. 0.605 టీఎంసీల నీరు ఉన్నట్లు పేర్కొన్నారు. తుంగభద్ర జలాలను విడుదల చేయక ముందు 0.442 టీఎంసీలు నీరు ఉండేవన్నారు. డ్యాం వద్ద ఏర్పాటు చేసిన శ్రీ సత్యసాయి, అనంత, శ్రీరామరెడ్డి, ఉరవకొండ, కూడేరు తాగునీటి ప్రాజెక్టులకు రోజుకు 55 నుంచి 65 క్యూసెక్కుల వరకు నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. ఆమెతో పాటు జేఈఈలు లక్ష్మీదేవి, ఫాతిమా తదితరులు ఉన్నారు.

## క్లుప్తంగా

### పాల సేకరణ రద్దుతో పాడి రైతులకు నష్టం



కలెక్టరేట్ వద్ద పాల సేకరణ సంఘాల కార్యదర్శులు, రైతులు

**అనంతపురం అర్బన్:** అమూల్ పాల సేకరణ ప్రక్రియను రద్దు చేస్తే పాడి రైతులు నష్టపోతారని పాలన సేకరణ సంఘాల కార్యదర్శులు, రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సంఘం ఆధ్వర్యంలో వారు శనివారం కలెక్టరేట్‌కు చేరుకుని కలెక్టర్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. రైతుల శ్రేయస్సు దృష్ట్యా పాల సేకరణ రద్దు కాకుండా చూడాలని కోరారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున, కార్యదర్శులు మాట్లాడుతూ జిల్లాలో అమూల్ పాల సేకరణ ద్వారా రైతులు ఆదాయం పొందుతున్నారన్నారు. రోజుకు 16 వేల లీటర్ల పాల సేకరణ జరుగుతోందన్నారు. సేకరణ రద్దు నేపథ్యంలో పాలను ప్రైవేటు డెయిరీలు కూడా తీసుకోవడం లేదన్నారు. రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకుడు రామకృష్ణ, కార్యదర్శులు, పాడి రైతులు జ్యోతి, మాధవి, కళావతి, మల్లీశ్వరి, కృష్ణవేణి, అనిత, అనసూయ జ్యోత్స్న, సూర్యనారాయణరెడ్డి, శ్రీనివాసులురెడ్డి గోపాల్, కేశవరెడ్డి, బాలప్ప పాల్గొన్నారు.

### పోక్సో కేసు నిందితుడికి రిమాండ్

**రాయదుర్గం:** పోక్సో కేసులో నిందితుడైన యువకుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు రాయదుర్గం అర్బన్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన బాలికకు మధుకుమార్ అనే యువకుడు మాయమాటలు చెప్పి లోబరుచుకున్నాడు. గర్భం దాల్చి గత ఏడాది బళ్లారి ఆస్పత్రిలో బాలిక మగబిడ్డను ప్రసవించింది. పెళ్లి చేసుకోకుండా బాలికను వదిలించుకోవాలని భావించిన మధుకుమార్.. పసికందును బెంగళూరులో ఓ కుటుంబానికి అప్పగించి స్వగ్రామానికి వచ్చేశారు. తర్వాత ఆ యజమానికి ఆ బిడ్డం ఇష్టం లేక స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అక్కడి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. మగబిడ్డను చైల్డ్‌హోమ్‌లో చేర్పించి.. కేసును రాయదుర్గం పోలీసులకు అప్పగించారు. దీంతో స్థానిక పోలీసులు పోక్సో చట్టం కింద మరో కేసు నమోదు చేసి.. మధుకుమార్‌ను రిమాండ్‌కు పంపించారు. బాలికకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టామని అర్బన్ సీఐ శ్రీనివాసులు తెలిపారు.

# స్నేహం.. శాశ్వతం

నేడు స్నేహితుల దినోత్సవం



స్నేహం.. ఒక అనిర్వచనీయమైన అనుబంధం. ఎల్లలులేని మమకారానికి ప్రతీక. కష్టమైనా, సుఖమైనా కలిసి పంచుకునే బంధం. నేనున్నానంటూ ఎవరైనా.. ఎప్పుడైనా.. ఎక్కడైనా కలుస్తూనే ఉన్నారంటే వారు కచ్చితంగా స్నేహితులై ఉంటారు. కుటుంబ సభ్యులతో చెప్పుకోని ఎన్నో ఊసులు స్నేహితుల మధ్య అరమరికలు లేకుండా అలా..అలా..మనస్సులో నుంచి బయటకు వచ్చేస్తాయి. మంచి స్నేహితునికి మించిన వరం మరొకటి ఉండదనేది పెద్దల మాట. ఎందుకంటే అమ్మలోని ఆప్యాయత, నాన్నలోని ప్రేమ, అన్నలోని అనురాగం, అక్కలోని అభిమానం అన్నీ రంగరిస్తే కన్పించేది స్నేహం. బాలల నుంచి వృద్ధుల వరకూ మిత్రుల మధ్య దొర్లే కబుర్లే వేరు. మనసులోని అంతరంగ ఆవిష్కరణలే భిన్నం. ప్రతి నెలా ఆగస్టు మొదటి ఆదివారం రోజున స్నేహితుల దినోత్సవం జరుపుకుంటున్నారు.

– అనంతపురం కల్చరల్/ బత్తలపల్లి:

### ఎల్లలు దాటిన స్నేహం



రమేష్ మిత్ర బృందం

అనంతపురానికి చెందిన రమేష్ ఇంజనీరింగ్ చదివి ఫ్రాన్స్, దుబాయ్ దేశాల్లో పనిచేసి.. ప్రస్తుతం బెంగళూరులో స్థిరపడ్డాడు. రామాంజనేయులు భరత మాత సేవలో తరిస్తూ ప్రస్తుతం పశ్చిమబెంగాల్‌లో ఆర్మీ హవల్దార్‌గా ఉన్నాడు. జ్ఞానప్రకాష్ స్వయం ఉపాధితో స్థిరపడితే, లింగారెడ్డి రాజకీయాల్లో రాణిస్తున్నాడు. వీరందరూ దాదాపు 30 ఏళ్ల కిందట నగరంలోని శ్రీసరస్వతీ విద్యామందిరంలో స్నేహితులయ్యారు. ఎవరింట్లో శుభకార్యం జరిగినా అందరూ కలవాలన్న నియమం పెట్టుకుని పాటిస్తున్నారు. వీరి భార్యలు కూడా మిత్రులు కావడంతో స్నేహంలోని మాధుర్యాన్ని ఆస్వాదిస్తున్నారు. తరచూ వేర్వేరు ప్రాంతాల్లో గెట్ టు గెదర్ అనో, పూర్వవిద్యార్థుల సమ్మేళనమనో కలుసుకుంటున్నారు.

### ఐదు దశాబ్దాల స్నేహబంధం



ముస్తాక్ మిత్ర బృందం

ఎప్పుడో పదవ తరగతి చదువుతున్నప్పుడు స్నేహితులయ్యారు. ఒకే లక్షణాలుండడంతో 50 ఏళ్లుగా స్నేహితులుగా కొనసాగుతున్నారు. అనంతపురానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు రియాజుద్దీన్, వ్యాపారంలో స్థిరపడిన సలీం, ప్రైవేటు ఉద్యోగులుగా ఉన్న ముస్తాక్ వయసు ఇప్పుడు 63 దాటిపోయింది. కొంత వయసు తక్కువైనా చాంద్‌బాషా కూడా 40 ఏళ్ల కిందటే వీరితో వచ్చి చేరాడు. వీరందరూ ఒకటి రెండేళ్ల వ్యత్యాసమున్నా మంచి స్నేహితులయ్యారు. ఎవరెవరు ఎక్కడ ఉన్నా ఉదయాన్నే కాఫీ హోటల్లో కలుసుకుని కబుర్లతో సరదాగా గడిపేస్తున్నారు. కష్టం వచ్చినపుడు నేనున్నానంటూ ఆదుకునే స్నేహితులు లేనప్పుడు బతుకు నిస్సారంగా ఉంటుందని చెప్పే వీరు ఇంతవరకు ఒక్కసారి కూడా పోట్లాడుకోలేదంటారు. కుటుంబాల పరంగా కూడా వాళ్లందరూ స్నేహితులైపోయారు.

### ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



స్నేహితులతో కలిసి ఉన్న మౌనిక(ఫైల్)

హేమ, మౌనిక, శోభ, రాజీ, సుప్రియ, గుణ, నేను (మౌనిక) అందరూ తిరుపతిలోని పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో డిగ్రీ చదువుకున్నాం. వివిధ ప్రాంతాలకు చెందిన మేము ఎంతో ఉల్లాసంగా కలిసి మెలిసి ఉన్నాం. మా మధ్య భేదాభిప్రాయాలనేవి రాలేదు. ఒకవేళ వచ్చినా అది నిమిషాలపాటే. తర్వాత అందరం కలిసే ఉత్సాహంగా తిరుగుతాం. విద్యాపరంగా, ఇతర విషయాల్లోనూ మంచి సూచనలు చేసుకుంటూ వస్తున్నాం. అలా ఉండడం నిజంగా అదృష్టమే. ఇతర ప్రాంతాల్లో ఉంటున్న మా స్నేహితులందరికీ స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు.

– మదనాపు మౌనిక, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, బత్తలపల్లి, శ్రీసత్యసాయి జిల్లా

### దోస్త్ మేరా దోస్త్..



చెన్నకృష్ణారెడ్డి, నాగభూషణ(ఫైల్)

బత్తలపల్లి పంచాయతీ పరిధిలోని వేల్పుమడుగు గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ కోళ్ల మొర్రం చెన్నకృష్ణారెడ్డి, గంటాపురం గ్రామానికి చెందిన నాగభూషణ ఇరువురూ పదవ తరగతి బత్తలపల్లిలో చదువుకుంటున్నపుడు స్నేహం చిగురించింది. డిగ్రీకి చేరే సమయానికి అది చెట్టయ్యింది. ఇప్పుడు మహా వృక్షంగా ఎదిగింది. వీరిద్దరూ కలిసి మెలిసి తిరుగుతూ.. ఒకరి యోగక్షేమాలు మరొకరు తెలుసుకుంటూ, పిల్లల భవిష్యత్ గురించి చర్చించుకుంటుంటారు. కష్టసుఖాలను తెలుసుకుంటూ.. సహకరించుకుంటూ ముందుకు సాగుతున్నారు. 40 ఏళ్లుగా అరమరికలు లేని వీరి స్నేహం గురించి అందరూ ఆశ్చర్యంగా చర్చించుకుంటుంటారు.

### మధురమైన స్నేహం



సొధామణి, సుగుణ(ఫైల్)

బత్తలపల్లికి చెందిన సొధామణి, సుగుణ స్నేహితులు. ఇద్దరూ కలిసి చదువుకున్నారు. 2008లో డీఎస్సీ రాశారు. అయితే ఉద్యోగం రాలేదు. అయినా ఇద్దరూ కలిసి న్యాయ పోరాటం చేశారు. 2013 నవంబర్ 6వ తేదీన ఉద్యోగంలో చేరారు. ఇలా తమ మధ్య ఉన్న స్నేహం కారణంగానే ఇది సాధ్యమైందని సొధామణి, సుగుణ అంటున్నారు. ఇప్పుడు ఇద్దరూ రొళ్ల మండలంలో టీచర్లుగా పనిచేస్తున్నారు.

### గుప్తనిధుల కోసం తవ్వకాలు

**బొమ్మనహాళ్:** ఉంతకల్లు గ్రామ శివారులోని పురాతన గంగాధరేశ్వర స్వామి ఆలయంలో గుప్త నిధుల కోసం శుక్రవారం రాత్రి తవ్వకాలు జరిపారు. వేటగాళ్లు నంది విగ్రహం ధ్వంసం చేసి ఆలయం బయట పడేశారు. విగ్రహం కింద రెండు అడుగుల మేర గొయ్యి తవ్వారు. శనివారం ఉదయం పొలానికి వెళ్లిన రైతు రామాంజికి ఆలయం తలుపు గడియ పగులగొట్టి.. నంది విగ్రహం ఆలయానికి దూరంగా పడివేసి ఉండటం గమనించి అర్చకులు అమరేష్‌కు సమాచారం అందించాడు. గ్రామస్తుల ద్వారా విషయం తెలుసుకున్న ఎస్ఐ శ్రీనివాసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. గుప్త నిధులు దొరికాయా.. తవ్విన వారు ఏ ప్రంతానికి చెందిన వారు అన్న చర్చలు జోరుగా సాగుతున్నాయి.

### గురుకులాల్లో అడ్మిషన్లు, బదిలీలు పూర్తి

**అనంతపురం ఎడ్యుకేషన్:** ఉమ్మడి జిల్లాలోని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకులాల్లో (అంబేడ్కర్) 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లు, బదిలీలు జూలై 31తో ముగిశాయని జిల్లా కోఆర్డినేటర్ అంగడి మురళీ కృష్ణ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. 11వ తరగతి ఆర్ట్స్ గ్రూప్ (ఎంఈసీ, హెచ్ఈసీ, సీఈసీ) గ్రూపుల్లో మిగులు సీట్లకు అడ్మిషన్లు కోరే విద్యార్థులు నేరుగా ఆయా స్కూళ్ల ప్రిన్సిపాళ్లను కలవాలని సూచించారు.

### జాతీయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

**అనంతపురం కల్చరల్:** స్వాతంత్య్ర వేడుకలను పురస్కరించుకొని ఆల్ ది బెస్ట్ అకాడమీ నిర్వాహకులు సేవాభారతి, తెలుగు తేజం జాతీయ అవార్డులందిస్తున్నట్లు నిర్వాహకులు ఈఎస్ఎస్ నారాయణ తెలిపారు. ఈ నెల18న హైదరాబాద్‌లో అవార్డుల ప్రదానోత్సవం ఉంటుందని పేర్కొన్నారు. వివిధ రంగాలలో విశేష కృషి చేస్తున్న వారు అవార్డులకు అర్హులని, వాటి వివరాలతో 'ఆల్ ది బెస్ట్ అకాడమీ సామాజిక సేవా సంస్థ, డోర్ నం.1–20–164, గోకుల్‌నగర్, వెంకటాపురం, సికింద్రాబాద్ –15' చిరునామాకు ఈ నెల 10లోపు దరఖాస్తులు పంపాలని సూచించారు. మరిన్ని వివరాలకు 96523 47207 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

## విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



ఐక్యత ప్రదర్శిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

**ఆత్మకూరు:** విద్యా రంగ– ప్రభుత్వ హాస్టళ్ల సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్ డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో మూడురోజులుగా నిర్వహిస్తున్న జీపుజాతా శనివారం ముగిసింది. ఆత్మకూరులోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల ఆవరణలో నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో జాన్సన్‌బాబు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులు, కాస్మోటిక్ చార్జీలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆత్మకూరులో కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న బీసీ హాస్టల్ భవనం స్థానంలో నూతన భవనం నిర్మించాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని కోరారు. విద్యార్థులకు శాపంగా మారిన జీఓ. 77ను రద్దు చేసి, హాస్టళ్లలో ఖాళీగా ఉన్న కుక్, అటెండర్, ట్యూటర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల ఆరో తేదీన కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాకు పెద్ద సంఖ్యలో విద్యార్థులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి రమణయ్య, కుల్లాయి స్వామి, రాష్ట్ర సమితి సభ్యులు సాయి స్వరూప, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## ముగ్గురు మహిళల బలవన్మరణం

• వేర్వేరు చోట్ల ఘటనలు



మృతురాలు ఏకుల సరస్వతి

**అనంతపురం:** జిల్లాలో వేర్వేరు కారణాలతో ముగ్గురు మహిళలు బలవన్మరణాలకు పాల్పడ్డారు. కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో వీరు ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. శ్రీ సత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం రామాపురానికి చెందిన పవన్‌కుమార్, కప్పల మేఘన (28) దంపతులు అనంతపురంలోని సాయినగర్‌లో నివాసం ఉంటున్నారు. భర్త తరచూ ఫోన్‌లో మాట్లాడుతుండడంతో మేఘన అనుమానం పెంచుకుంది. ఇదే విషయమై శనివారం ఇద్దరి మధ్య మాటామాటా పెరగడంతో గొడవకు దారితీసింది. మనస్తాపం చెందిన మేఘన ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ క్రాంతికుమార్ తెలిపారు.

• అనంతపురం మారుతినగర్‌కు చెందిన నాగమణి (33) అనే రైల్వే ఉద్యోగి క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకున్నారు. నాలోగో టౌన్ సీఐ ఆర్.ప్రతాప్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భర్త యశ్వంత్‌బాబు మృతి చెందిన తర్వాత నాగమణికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం రాకుండా అత్త,మామలు అప్పట్లో అడ్డుకున్నారు. అనేక దఫాలు ప్రయత్నం చేసి ఉద్యోగం దక్కించుకుంది. కదిరిలో ఎలక్ట్రికల్ విభాగంలో ఏఈగా విధులు నిర్వర్తిస్తున్న ఈమెకు ఇటీవల గుంతకల్లుకు బదిలీ అయ్యారు. అదే ప్రాంతంలో మెట్టినింటి వారు ఉండటంతో.. తనకు వారి నుంచి సమస్యలు ఎదురవుతాయనే ఒత్తిడికి లోనై శనివారం ఆత్మహత్య చేసుకుంది.

**అప్పుల బాధతో మహిళ ఆత్మహత్య**

**వజ్రకరూరు:** అప్పుల బాధతో మహిళ ఆత్మహత్య చేసుకుంది. రాగులపాడుకు చెందిన ఏకుల సరస్వతి (36), ఏకుల శేఖర్ దంపతులు. కిడ్నీ సమస్యతో శేఖర్ నాలుగేళ్ల క్రితం చనిపోయాడు. అప్పట్లో భర్త వైద్యం కోసం, పిల్లల చదువులు, కుటుంబ అవసరాల నిమిత్తం సరస్వతి ప్రైవేట్ వ్యక్తుల వద్ద చేసిన అప్పులు రూ.15 లక్షలకు చేరాయి. వాటిని ఎలా తీర్చాలా అని రోజూ మదన పడుతూ ఉండేది. అప్పులు తీరే మార్గం కనిపించకపోవడంతో సరస్వతి శుక్రవారం రాత్రి ఇట్లోనే ఉరివేసుకుంది. శనివారం తెల్లవారుజామున పిల్లలు గమనించి కుటుంబ సభ్యులకు తెలిపారు. అప్పటికే సరస్వతి మృతి చెందినట్లు గుర్తించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ వేణుగోపాల్ తెలిపారు.

### గ్యాస్ సిలిండర్ పేలి మహిళకు గాయాలు

**అనంతపురం:** నగర శివారులోని తపోవనం శివాలయ సమీపంలో గ్యాస్ సిలిండర్ పేలి శాంతి అనే మహిళకు తీవ్రగాయాలయ్యాయి. శనివారం వంట వండేందుకు గ్యాస్ సిలిండర్ ఆన్ చేయగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గాయపడిన శాంతిని సర్వజనాస్పత్రికి తరలించారు.





## గుండెపోటుతో హెడ్‌కానిస్టేబుల్ మృతి



శ్రీనివాసులు భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది

**అనంతపురం:** అనంతపురం త్రీటౌన్ పోలీస్ స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు (60) గుండెపోటుతో శనివారం మృతి చెందారు. విధి నిర్వహణలో ఉన్న శ్రీనివాసులుకు తెల్లవారుజామున గుండెపోటు రాగా సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. అయితే అప్పటికే ఆయన మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో మృతదేహాన్ని కళ్యాణదుర్గం రోడ్డులోని స్వగృహానికి తరలించారు. శ్రీనివాసులుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. జేఎన్‌టీయూ రోడ్డులోని శ్మశానవాటికలో అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఏఆర్ డీఎస్పీ మునిరాజ, త్రీటౌన్ సీఐ ధరణికిశోర్, ఎస్ఐ గోపాలుడు, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అడ్‌హక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, సుధాకర్‌రెడ్డి, హరినాథ్, తేజ్‌పాల్, శ్రీనివాసులు నాయుడు, లక్ష్మీనారాయణ తదితరులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. హెడ్‌కానిస్టేబుల్ కుటుంబ సభ్యులకు ఎస్పీ మురళీకృష్ణ సానుభూతి తెలిపారు. కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు.

### సీజనల్ వ్యాధులపై అప్రమత్తం





మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ సుజాత

**అనంతపురం మెడికల్:** సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ డాక్టర్ సుజాత మలేరియా యూనిట్ సిబ్బందిని ఆదేశించారు. శనివారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో మలేరియా సబ్ యూనిట్ అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. మలేరియా, డెంగీ ప్రబలకుండా ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా మునిసిపాలిటీలతో సమన్వయం చేసుకుని ఫాగింగ్, స్ప్రేయింగ్, డ్రైడే పాటించేలా సిబ్బందికి సూచనలివ్వాలన్నారు. జిల్లా మలేరియా అధికారి ఓబులు మాట్లాడుతూ దోమకాటు నివారణ చర్యలు పక్కాగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సహాయ మలేరియా అధికారి సత్యనారాయణ, ఉమ్మడి జిల్లాలోని సబ్ యూనిట్ అధికారులు, సూపర్‌వైజర్లు, ఎంపీహెచ్ఈఓలు గిరిధర్ రెడ్డి, లక్ష్మానాయక్, రమేష్‌బాబు పాల్గొన్నారు.

## టీడీపీ నాయకుడి ఇసుక దందా



స్వాధీనం చేసుకున్న వాహనాలను పోలీసు స్టేషన్ వద్ద ఉంచిన దృశ్యం

**తాడిపత్రి రూరల్:** ఆలూరు సమీపంలో టీడీపీ నాయకుడి ఇసుక దందాకు అధికారులు చెక్ పెట్టారు. సజ్జలదిన్నెకు చెందిన టీడీపీ నాయకుడు ఆలూరు సమీపంలోని డంప్ నుంచి ఇసుకను అక్రమంగా టిప్పర్, ట్రాక్టర్‌కు జేసీబీ సాయంతో నింపుతుండగా గనులు, భూగర్భ శాఖ అధికారులు శనివారం అడ్డుకున్నారు. వాహనాలు స్వాధీనం చేసుకుని, సజ్జలదిన్నెకు చెందిన టిప్పర్ డ్రైవర్ విజయరాజు, జేసీబీ డ్రైవర్ వంశీ, తాడిపత్రి భగత్‌సింగ్ నగర్‌కు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ కుళ్లాయప్పలను తాడిపత్రి అప్‌గ్రేడ్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. అధికారుల నుంచి ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

• 15 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్
• రూ.17.10 లక్షల నగదు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ బాజీజాన్ సైదా

**పెనుకొండ:** శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మండలం శెట్టిపల్లి వద్ద పేకాట స్థావరంపై పోలీసులు శనివారం దాడి చేశారు. 15 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.17.10 లక్షల నగదు, 5 వాహనాలు, 15 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను పెనుకొండ డీఎస్పీ బాజీజాన్ సైదా శనివారం రాత్రి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరులకు వెల్లడించారు. పుట్టపర్తికి చెందిన రవి అనే వ్యక్తి శెట్టిపల్లి వద్ద పేకాట స్థావరం నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. సీఐ యుగంధర్, ఎస్ఐలు రాజేష్, రంగడు వారి సిబ్బందితో వెళ్లి దాడి చేశారు. కర్ణాటక, కడప, కర్నూలు ప్రాంతాలకు చెందిన 15 మందిని అరెస్టు చేశారు. భారీగా నగదు, సెల్‌ఫోన్లు, వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకుడు రవితో పాటు మరికొందరు అక్కడి నుంచి తప్పించుకున్నారు. వారిని కూడా త్వరలోనే అరెస్ట్ చేస్తామని డీఎస్పీ తెలిపారు.

### బెయిల్‌పై డీఆర్ఎం విడుదల

**గుంతకల్లు:** అవినీతి ఆరోపణల కేసులో అరెస్టయ్యి రిమాండ్‌లో ఉన్న గుంతకల్లు రైల్వే డివిజనల్ మేనేజర్ (డీఆర్ఎం) వినీత్‌సింగ్‌తో పాటు డీఎఫ్ఎం ప్రదీప్‌బాబు శనివారం బెయిల్‌పై విడుదలయ్యారు. రైల్వే అధికారులు, కాంట్రాక్టర్ల మధ్య ముడుపుల వ్యవహారానికి సంబంధించి జూలై 4వ డీఆర్ఎం వినీత్‌సింగ్, సీనియర్ డీఎఫ్ఎం ప్రదీప్‌బాబు, సీనియర్ డీఈఎన్ కో ఆర్డినేషన్ అక్కిరెడ్డితో పాటు మరికొంతమంది ఉద్యోగులను సీబీఐ అధికారుల బృందం అరెస్ట్ చేసింది. దాదాపు నెల రోజులు కర్నూలు జిల్లా సబ్ జైలులో రిమాండ్‌లో ఉన్న వీరిలో డీఆర్ఎం వినీత్‌సింగ్, సీనియర్ డీఎఫ్ఎం ప్రదీప్‌బాబులకు హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. మరో ఇద్దరు ఉద్యోగులకు గతంలోనే బెయిల్ మంజూరైన విషయం విదితమే.

### పట్టపగలే చోరీ

**బత్తలపల్లి:** అనంతసాగరం గ్రామంలో పట్టపగలే చోరీ జరిగింది. గ్రామానికి చెందిన కొండమ్మ కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. శనివారం ఇంటికి తాళం వేసి కూలి పనులకు వెళ్లింది. మధ్యాహ్నం వేళ దుండగులు తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి దొరికినవి పట్టుకెళ్లారు. కూలి పనులు ముగించుకుని వచ్చిన కొండమ్మ.. ఇంటి తలుపులు తెరిచి ఉండడం చూసి లోనికెళ్లి పరిశీలించింది. బీరువాలోని మూడు తులాల బంగారు తాళిబొట్టు చైన్, 4తులాల దండ, జత కమ్మలు, వెండి గొలుసులతో పాటు రూ.50 వేల నగదు చోరీ అయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

### రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలు ప్రారంభం



పోటీల్లో గెలిచిన చిన్నారులతో నిర్వాహకులు

**తాడిపత్రి అర్బన్:** రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలు శనివారం తాడిపత్రిలోని పుట్లూరు రోడ్డు బాలాజీ ఫంక్షన్‌హాలులో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. అండర్–13 విభాగంలో రెండు రోజులపాటు సాగే ఈ పోటీలను బిజెవైఎం రాష్ట్ర నాయకులు హరీష్‌రెడ్డి, తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి వేణుగోపాల్ ప్రారంభించారు. 400 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. తొలిరోజు పోటీల్లో గెలిచిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు.

### 4జీ సిమ్ ఉచిత అప్‌గ్రేడేషన్

**అనంతపురం సిటీ:** పాన్ ఇండియా ఆధారంగా బీఎస్ఎన్ఎల్ (భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్) 4జీ సాంకేతికతను అందుబాటులోకి తెచ్చినట్లు ఆ శాఖ ఉమ్మడి జిల్లా జనరల్ మేనేజర్ షేక్ ముజీబ్ పాషా శనివారం తెలిపారు. తమ సంస్థ 2జీ, 3జీ సిమ్‌లు వినియోగించే వారు వెంటనే 4జీ అప్‌గ్రేడ్ చేసుకోవాలని కోరారు.

## క్లుప్తంగా

### ప్రత్యామ్నాయ పంటలే మేలు


మాట్లాడుతున్న ఏఓ జే.శశికళ

అనంతపురం అగ్రికల్చర్: వర్షం వస్తే ఆగస్టులో ప్రత్యామ్నాయం కింద జొన్న, కొర్ర, స్వల్పకాలిక కంది, సజ్జ, అలసంద, ఉలవ, మినుము లాంటి పంటలు వేసుకోవాలని రూరల్ మండల వ్యవసాయాధికారి జే.శశికళ తెలిపారు. శనివారం కురుగుంట, కామారుపల్లి గ్రామాల్లో ఉన్న రైతు సేవా కేంద్రాల్లో (ఆర్ఎస్‌కే) రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అర్హత కలిగిన రైతులకు కౌలురైతుల గుర్తింపు కార్డులు ఇస్తామన్నారు. దీని వల్ల స్వంత భూమిదారులకు ఎలాంటి నష్టం లేకుండా కౌలుదారులకు ప్రభుత్వం నుంచి ప్రయోజనాలు వర్తింపజేస్తామన్నారు. ఖరీఫ్ సాగుకు అదను ముగిసినందున ఇక వర్షం వస్తే భూములు ఖాళీగా పెట్టుకోకుండా ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలన్నారు. ఈనెల 5వ తేదీ నుంచి ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ మొదలు పెడతామన్నారు. సమావేశంలో గ్రామ సర్పంచులు, వీఆర్ఓలు, ఆర్ఎస్‌కే ఇన్‌చార్జ్‌లు, పలువురు రైతులు పాల్గొన్నారు.

### రెండు లారీల ఢీ: త్రుటిలో తప్పిన ప్రమాదం




ఆత్మకూరు: మండల కేంద్రానికి సమీపంలోని బైపాస్ వద్ద శనివారం తెల్లవారుజామున రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. వివరాలు.. కళ్యాణదుర్గం నుంచి వస్తున్న లారీని అనంతపురం వైపు నుంచి వస్తున్న లారీ వేగంగా ఢీకొట్టింది. అనంతపురం నుంచి వస్తున్న లారీ డ్రైవర్ నిద్రమత్తులో ఉండటంతో ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు చెబుతున్నారు. ఈ ప్రమాదంలో ఓ డ్రైవర్ గాయాల పాలయ్యాడు. అతడ్ని చికిత్స నిమిత్తం 108 వాహనంలో అనంతపురం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### పూర్వ ఆచార్యుల సేవలు అమూల్యం


ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో పూర్వ ఆచార్యుల సేవలు ప్రశంసనీయమని ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనిత అన్నారు. పూర్వ ప్రొఫెసర్ల స్ఫూర్తి, ఆదర్శాలను నేటి ప్రొఫెసర్లు అనుసరిస్తుండటం గర్వకారణమన్నారు. శనివారం ఎస్కేయూలో విశ్రాంత ఉపాధ్యాయుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉద్యోగ విరమణ చేసిన ప్రొఫెసర్లకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇన్‌చార్జ్ వీసీ మాట్లాడుతూ.. పూర్వ ప్రొఫెసర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. రెక్టార్ ప్రొఫెసర్ జి.వెంకటనాయుడు, రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్ బాబు మాట్లాడుతూ.. రావాల్సిన బకాయిలు అన్నీ చెల్లించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అనంతరం సర్వసభ్య సాధారణ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షుడిగా ప్రొఫెసర్ పుల్లయ్య వ్యవహరించారు. జాయింట్ సెక్రెటరీ ప్రొఫెసర్ కృష్ణా రెడ్డి సంఘం సంవత్సర నివేదికను సభ్యులకు చదివి వినిపించారు. కార్యక్రమంలో కోశాధికారి ప్రొఫెసర్ బి.ఫణీశ్వర రాజు పాల్గొన్నారు.

### సుప్రీంకోర్టు తీర్పుపై హర్షం


అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై దళితులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో దళితులు వన్నూరప్ప, ఈశ్వరయ్య, అంకాలప్ప, ఓబన్న, మల్లన్న, ప్రకాష్, నారాయణ, పెద్దన్న, మల్లయ్య, అంజినప్ప, మురళి, శ్రీరాములు, లక్ష్మన్న పాల్గొన్నారు.

- వర్షాలు పడక అన్నదాతల అవస్థలు
- ఎండుతున్న పైర్లు
- ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి అందని సహాయం

# వరుణుడి జాడేదీ?


వేరుశనగ పంటలో మెట్ల సేద్యం చేస్తున్న రైతు

ఆత్మకూరు: మేఘాలు దట్టంగా కమ్ముకుంటున్నా వరుణుడు మాత్రం కరుణించడం లేదు. చిరుజల్లులు మాత్రమే కురుస్తున్నాయి. పంటలు సాగు చేసిన అన్నదాతలు వర్షాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నెల రోజుల క్రితం కురిసిన ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. పొలాల్లో వేరుశనగతో పాటు, ప్రధాన పంటలు అయిన ఆముదం, కంది పంటలను కూడా సాగు చేశారు. ఇంకా మండలంలో చాలా మంది రైతులు వర్షం పడకపోవడంతో పంటలు సాగు చేసేందుకు పొలాలను సిద్ధం చేశారు. మేఘాలు ఊరిస్తున్న గాలి అధికంగా వీస్తుండటంతో వర్షం కురవడం లేదు. ఏం చెయ్యాలో దిక్కుతోచని పరిస్థితుల్లో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. జిల్లాలో పలు చోట్ల ఓ మోస్తరు వర్షాలు కురిసినప్పటికి ఆత్మకూరు మండలంలో మాత్రం గత నెల రోజులకు పైగా వర్షాలు కురవలేదు.

**తగ్గిన పంటల సాగు**

మండల వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసే రైతుల సంఖ్య ఈ ఏడాది చాలా తక్కువగా ఉందనే చెప్పవచ్చు. వర్షం కోసం ఎదురు చూస్తు రైతులు చాలా మంది పంటలు సాగు చేయలేక పోయారు. మండల వ్యాప్తంగా గతంలో కేవలం వేరుశనగ మాత్రమే 12,300 హెక్టార్లలో సాగు చేసేవారు. కాని ప్రస్తుతం మండల వ్యాప్తంగా కేవలం 3,500 హెక్టార్లు వేరుశనగ, 2 వేల హెక్టార్లు కంది, 2,500 హెక్టార్లు ఆముదం సాగు చేశారు. గతంలో కన్నా ఈ ఏడాది పంట సాగు పూర్తిగా తగ్గిందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

**పంటను కాపాడుకునేందుకు అవస్థలు**

గత నెల రోజుల నుంచి వర్షాలు లేకపోవడంతో సాగు చేసిన వేరుశనగ, ఆముదం, కంది పంటలను రైతులు పంటలను పోగొట్టుకోలేక పంటను కాపాడుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం రైతులు పొలాల్లో మెట్లు తోలుతున్నారు. సాగు చేసిన పంటలో ఈ వ్యవసాయ పనులు చేస్తే అడుగున్న ఉన్న తేమ పైకి వచ్చి పంట కొద్ది రోజులు ఎండుముఖం పట్టకుండా ఉంటుందని రైతులు తెలిపారు.

**అందని ప్రభుత్వ సహాయం..**

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు పెట్టుబడి సహాయం కింద ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా అన్నదాతకు ఏడాదికి రైతు భరోసా సాయం అందించింది. జగనన్న నేరుగా రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేశారు. అంతేకాకుండా వర్షాకాలంలో పంటలు నష్టపోయినా, ఎండిపోయినా రైతులు ఏవిధంగా పంట నష్టపోయినా ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ కింద రైతులకు నష్టపరిహారాన్ని అందించారు. కానీకూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులకు ఏడాదికి రూ.20 వేలు అందిస్తామని హామీ ఇచ్చారు. అయితే అధికారంలోకి రెండు నెలలు గడుస్తున్నా సాయం అందించలేదు. ఖరీఫ్ సీజన్ కూడా దాటిపోతోంది. కాని ఇంత వరకు రైతులకు మాత్రం ప్రభుత్వం చిల్లి గవ్వ ఇచ్చిన పాపాన పోలేదు. కనీసం ఖరీఫ్ సీజన్‌లో పెట్టుబడి సహాయం కింద కూడా అందించకుంటే ఎలా అంటూ రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### రూ.20 వేలు ఇవ్వాలి..



కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.20 వేలు అన్నదాతలకు ఇస్తామని చెప్పారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ కూడా దాటిపోతోంది. కాని రైతులకు ఇంత వరకు ఏమీ ప్రకటించలేదు. గతంలో జగనన్న ఇచ్చిన మాట ప్రకారం ఎన్ని ఇబ్బందులు ఉన్నా రైతులకు అండగా నిలిచి రైతు భరోసా కింద పెట్టుబడి సహాయం అందించారు. చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే వెంటనే సాయం అందజేయాలి. – వెంకటేష్, సింగంపల్లి

### అప్పులు చేసి పెట్టుబడులు



ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో పంట సాగు చేసేందుకు మా దగ్గర ఏమి లేదు. చాలా మంది రైతులు పెట్టుబడి కోసం బయట అప్పులు చేసి పంటలు సాగు చేస్తున్నారు. పంటలు సాగు చేసినా వర్షాలు లేకపోవడంతో అవి కూడా ఎండుముఖం పట్టాయి. రైతులను ప్రభుత్వం తప్పకుండా ఆదుకోవాలి. – పుల్లారెడ్డి, రైతు, ఆత్మకూరు

### ఆముదం సాగుకు అవకాశం



ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పంటల సాగు సమయం ముగిసింది. ఒక వేళ వర్షాలు వస్తే కేవలం ఆముదం పంట సాగుకు మాత్రమే అనుకూలంగా ఉంటుంది. పంటలు సాగు చేసే ముందు రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు తీసుకోవాలి. ఆముదం సాగులో సస్యరక్షణ చర్యలు చేపడితే లాభాలు ఆర్జించవచ్చు. – సుచరిత, ఏఓ

### పోలీసుల స్పందన అభినందనీయం


కేసు చేధించిన పోలీసులతో సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు

అనంతపురం మెడికల్: బేబీ మిస్సింగ్ కేసుపై అనంతపురం సబ్ డివిజన్ పోలీసులు సకాలంలో స్పందించిన తీరు అభినందనీయం. అందుకు సహకరించిన డీఎస్పీ ప్రతాప్‌కుమార్ బృందం సీఐలు ప్రతాప్‌రెడ్డి, క్రాంతికుమార్, ఏఎస్ఐ త్రిలోక్, తదితరులకు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు కృతజ్ఞతలు తెలిపారు. గత నెల 28న ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో అమృత కూతురిని ఆమని అనే మహిళ ఎత్తుకెళ్లిన విషయం విదితమే. ఈ కేసులను పోలీసులు మూడు గంటల్లో చేధించి, తల్లి అమృత చెంతకు బిడ్డను చేర్చేలా చర్యలు తీసుకున్న విషయం విదితమే. ఈ సందర్భంగా పోలీసులు చూపిన చొరవకు శనివారం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో సీఐలు ప్రతాప్‌రెడ్డి, క్రాంతికుమార్, ఔట్‌పోస్టు ఇన్‌చార్జ్ త్రిలోక్, తదితరులను సూపరింటెండెంట్ శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

### నేడు కిషోర్‌కుమార్ సంగీత కచేరీ

అనంతపురం కల్చరల్: అనంత ఘంటసాల ఆరాధన సమితి నేతృత్వంలో ప్రఖ్యాత హిందీ నేపథ్య గాయకుడు కిషోర్‌కుమార్ జయంతి సందర్భంగా సంగీత కచేరీ నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ నిర్వాహకుడు పాలసముద్రం నాగరాజు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు స్థానిక మూడవ రోడ్డులోని ఘంటసాల భవన్ ప్రాంగణంలో, సాయంత్రం లలిత కళాపరిషత్తులో వేర్వేరుగా ఆ పాత మధురాలను గాయనీ గాయకులు ఆలపిస్తారని పేర్కొన్నారు. కళాభిమానులు పెద్ద ఎత్తున విచ్చేయాలని కోరారు.

## పనులు వేగవంతం చేయండి


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనులను నాణ్యతతో వేగవంతంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని మేయర్ వసీం అధికారులను ఆదేశించారు. శనివారం 38, 39, 43, 45వ డివిజన్ల పరిధిలోని 2, 4, 5 రోడ్లతో పాటు జన్మభూమి రోడ్డు, లక్ష్మీనగర్, కోవూర్ నగర్‌లలో మునిసిపల్ ఆర్‌డీ పీవీవీఎస్ మూర్తితో కలసి పర్యటించారు. రెండో రోడ్డులోని నేతాజీ నగరపాలక పాఠశాలలో మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. పాఠశాలలో అర్ధాంతరంగా ఆగిపోయిన భవన నిర్మాణానికి నగరపాలక సంస్థ సాధారణ నిధులు కేటాయించి తక్షణమే టెండర్లను ఆహ్వానించాలన్నారు. 43వ డివిజన్‌లో పారిశుధ్య పనులు, 39వ డివిజన్‌లో పూడికతీత పనులను పరిశీలించారు. ప్రజా సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఫాగింగ్ చేపట్టడంతో పాటు మురుగు ఎక్కడ నిల్వ ఉండకుండా చూడాలని ఆదేశించారు. పీఏబీఆర్ డ్యాంలోకి తుంగభద్ర నుంచి నీరు వస్తుండటంతో నీరు రంగు మారే అవకాశం ఉందన్నారు. వేడి చేసుకుని చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. మేయర్ వెంట కార్పొరేటర్లు కమల్‌భూషణ్, ఇసాక్, ఈఈ సూర్యనారాయణ, డీఈ రవీంద్రరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు చింతకుంట మధు, తదితరులు ఉన్నారు.

## ప్రొవిజినల్ సర్టిఫికెట్ల జారీలో నిర్లక్ష్యం


ఇన్‌చార్జ్ వైస్ చాన్సలర్ అనితకు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్ విద్యార్థి విభాగం ప్రతినిధులు

అనంతపురం: శ్రీకృష్ణదేవయరాయ విశ్వవిద్యాలయంలో డిగ్రీ, పీజీ కోర్సులు పూర్తి చేసి ప్రొవిజినల్ మార్కుల జాబితా కోసం మూడు నెలలుగా తిరుగుతున్నా పరీక్షల విభాగం అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ తిప్పుకుంటున్నారని వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు ఆరోపించారు. శనివారం ఎస్కేయూ ఇన్‌చార్జ్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అనితకు ఫిర్యాదు చేశారు. ప్రింటర్లు పని చేయడం లేదని సాకులు చెబుతూ పరీక్షల విభాగం అధికారులు విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఇలాగైతే విద్యార్థుల భవితవ్యం ఏం కావాలని నిలదీశారు. వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకుని విద్యార్థులకు సకాలంలో ప్రొవిజినల్ మార్కుల జాబితాలు అందేలా చూడాలని కోరారు. లేదంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ విద్యార్థి విభాగం ప్రతినిధులు హేమంత్‌కుమార్, హరి, శివ, భరత్, జయంత్, చంద్రహాస్ తదితరులు పాల్గొన్నారు.

## బిడ్డకు ముర్రుపాలు పట్టించాలి


తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేస్తున్న సీడీపీఓ ధనలక్ష్మి


తోపుదుర్తిలో ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు


రాప్తాడు: తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ ప్రసన్న

అనంతపురం మెడికల్: తల్లిపాలే బిడ్డకు రక్షణగా నిలుస్తాయి. పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు పట్టించాలి. రెండేళ్ల వరకు పిల్లలకు తల్లిపాలు అందించవచ్చని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ లలిత కుమారి పేర్కొన్నారు. శనివారం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని నర్సింగ్ కళాశాల ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యతను నర్సింగ్ విద్యార్థినులు ఫ్లకార్డులు, తదితర ప్రదర్శనల ద్వారా తల్లులకు తెలియజేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. పుట్టిన వెంటనే బిడ్డకు తల్లిపాలు అందించాలన్నారు. అపోహలు, ఆచారం పేరుతో తల్లిపాలు ఇవ్వకుండా వేరే పాలను పట్టించరాదన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ సంధ్య, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రవీణ్‌దీన్ కుమార్, వైద్యులు డాక్టర్ పద్మశ్రీ, డాక్టర్ శంకర్ నారాయణ, నర్సింగ్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ అనంతమ్మ, అధ్యాపకురాలు భాగ్యరాణి, అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

**ఇల్లాలి చదువు.. ఇంటికి వెలుగు**

ఆత్మకూరు: ప్రతి మహిళా చదువుకోవాలి. ఇల్లాలి చదువు-ఇంటికి వెలుగు అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లావణ్య, శ్రీవాణి తెలిపారు. శనివారం మండల వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాల్య వివాహాలు చేయరాదన్నారు. బాల్య వివాహాలు చేయడం వల్ల ఆడపిల్లలు చదువుకు దూరం అవుతున్నారని తెలిపారు. అంతేకాకుండా ఆర్డీటీ, విద్య పంచాయతీ శాఖల వారి సహకారంతో 'ఇల్లాలి చదువు-ఇంటికి వెలుగు' అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో తొలిసారిగా ఈ కార్యక్రమాన్ని ఆత్మకూరు మండలంలో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అంతేకాకుండా ఈ నెలలో స్త్రీలకు టైలరింగ్ నేర్పించేందుకు సిద్దరాంపురం ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఇందులో 20 మంది మహిళలకు రూ.100 రుసుముతో టైలరింగ్ నేర్పిస్తామని తెలిపారు.

**ముర్రుపాలే బిడ్డకు శ్రీరామ రక్ష**

రాప్తాడు: తల్లి ముర్రుపాలే బిడ్డకు శ్రీరామ రక్ష అని ఎంఎల్‌హెచ్‌పీ ప్రసన్న, అంగన్‌వాడీ కార్యకర్త యల్లమ్మ పేర్కొన్నారు. శనివారం చిన్మయనగర్-1 అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బిడ్డకు సక్రమంగా తల్లిపాలు అందించినప్పుడే ఆరోగ్యంగా పెరుగుతారన్నారు. ప్రతి ఒక్కరూ బిడ్డ పుట్టిన మరుక్షణం నుంచే తల్లి పాలు ఇవ్వాలన్నారు. బిడ్డ ఎదుగుదలకు కావాల్సిన పోషకాలు తల్లి పాలలో పుష్కలంగా ఉంటాయని తెలిపారు. ఆరు నెలలు వరకు బిడ్డకు తల్లి పాలు ఇవ్వాలని.. ఏడో నేల నుంచి ఇంట్లో వండుకున్న ఆహార పదార్థాలను తల్లిపాలతో పాటు రెండు సంవత్సరాల వరకు ఇవ్వాలన్నారు. తల్లులు పిల్లలకు పాలు పట్టించేటప్పుడు పరిశుభ్రత పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఎన్ఎం చంద్రకళ, అంగన్‌వాడీ సహాయకురాలు విజయలక్ష్మి, ఆశా కార్యకర్తలు శివలక్ష్మి, నాగేంద్రమ్మ, వీరమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

**తల్లిపాలే బిడ్డకు అమృతం**

అనంతపురం ఎడ్యుకేషన్: తల్లిపాలు బిడ్డకు అమృతం వంటివని ఐసీడీఎస్ అనంతపురం రూరల్ సీడీపీఓ ధనలక్ష్మి పేర్కొన్నారు. రూరల్ మండలం 5వ సెక్టార్ పరిధిలోని సత్యదేవనగర్‌లో శనివారం 'తల్లిపాల వారోత్సవాలు' నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేస్తూ తల్లులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. పుట్టిన బిడ్డకు గంటలోపే ముర్రుపాలు ఇవ్వాలని సూచించారు. చక్కెర, తేనె లాంటివి శిశువుకు తాపొద్దన్నారు. ఆర్నెళ్ల తర్వాత నుంచి పాలతో పాటు అనుబంధ పోషకాహారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయశ్రీ, సీహెచ్ఓ దివ్యశ్రీ, ఏఎన్ఎం సరస్వతి, అంగన్‌వాడీ వర్కర్లు ప్రభావతి, శంకరమ్మ, సరస్వతి, అరుణకుమారి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఏడు శనివారాల వ్రతం


అశోక్ నగర్‌లోని సత్యదేవుడి ఆలయంలో వ్రతం ఆచరిస్తున్న మహిళలు


ఆర్ఎఫ్ రోడ్డులోని లక్ష్మీవేంకటేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు


నాగుల కట్ట వద్ద టెంకాయలు కొట్టి పూజలు చేస్తున్న మహిళలు

అనంతపురం కల్చరల్: శ్రీనివాసుడికి ప్రీతికరమైన ఏడు శనివారాల వ్రతం నయనానందకరంగా సాగింది. శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు స్థానిక ఆర్ఎఫ్ రోడ్డులోని లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సందడి నెలకొంది. వందలాది మహిళా భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. మహిళలు పవిత్ర కంకణధారులై పసుపు వస్త్రాలతో స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. వేదికపై సర్వాంగ సుందరంగా కొలువుదీర్చిన శ్రీదేవి, భూదేవి సహిత శ్రీనివాసుడి ఉత్సవ విగ్రహాలకు ముందుగా విశేష పూజలు చేపట్టారు. వేద మంత్రాలు పఠించిన పౌరోహితుల సూచనలకనుగుణంగా మహిళలు పుష్పాలతో తమ ముందు పెట్టుకున్న స్వామి విగ్రహాలకు పూజలు చేశారు. సామూహిక దీపారాధన సమయంలో ఒక్కసారిగా వెలిగించిన దీపకాంతులు ఆలయ పరిసరాలను మరింత శోభాయమానం చేశాయి. అంతకు ముందు అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అశోక్ నగర్‌లోని రమాసమేత సత్యనారాయణ స్వామి ఆలయంలో ఏడు శనివారాల వ్రతాలు జరిగాయి. కార్యక్రమంలో ఫణిరాజ్, తిరువీధుల జగదీష్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

### వివాహిత ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న గంగాదేవి

కనగానపల్లి: మండలంలోని చంద్రాచర్ల గ్రామానికి చెందిన వివాహిత గంగాదేవి పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి రైతు శ్రీనివాసులు భార్య గంగాదేవి గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో మనస్థాపానికి గురైన ఆమె శనివారం వారి పొలం వద్ద ఉన్న పురుగుల మందు సేవించింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

### ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం

రామగిరి: మండలంలోని శేషంపల్లి గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు సుధాకర్, చంద్రశేఖర్, మౌలాలి బాషా మాట్లాడుతూ.. పాడిపశువులకు కృత్రిమ గర్భధారణ చేయిస్తే ఫలితాలు ఉంటాయన్నారు. పశువులకు ఎద ఇంజక్షన్లు వేసిన తరువాత 20 రోజుల పాటు బెల్లం నీళ్లు, టెంకాయ నీళ్లు తాగించడంతో పాటు మునగాకు, కరివేపాకు మేతగా పెట్టాలని సూచించారు. దాదాపు 50 పశువులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### శాకంబరీ అలంకారంలో వాసవీ మాత


శాకంబరీ అలంకారంలో వాసవీమాత


పూజలందుకున్న శ్రీనివాసుడు

అనంతపురం కల్చరల్: ఆషాఢమాసం చివరి శనివారం సందర్భంగా పాతూరు వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. వాసవీ మాతను శాకంబరీగా అలంకరించి ఆరాధించారు. ఉదయం నుంచి పెద్ద ఎత్తున తరలి వచ్చిన వాసవీ మహిళా మండలి సభ్యులు అమ్మవారిని వివిధ రకాల కూరగాయాలు, ఆకుకూరలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అమ్మవారి స్తోత్రాలు, భజన గీతాలు ఆలపించారు. అదేవిధంగా వేంకటేశ్వర స్వామికి పూజలు చేశారు. వేంకటేశ్వరుడి సామూహిక 'గోవింద నామావళి' ఈనెల 1న ప్రారంభమైందని.. ఈనెల 7 వరకు సాగుతుందని మహిళా మండలి అధ్యక్షురాలు చల్లా స్వర్ణలత తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షురాలు పిన్ని నాగరత్నం, ఆలయ ధర్మకర్త గర్జాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.